పుత్రభేదం

రాత్రి ఎనిమిది-భోజనాల వేళ-

ఆకలి అవుతోంది. అందరం కనిపెట్టుకుని ఉన్నాం. మా వాడింకా ఊడిపడ లేదు. మిగతా పిల్లలందరూ రుసరుసలాడుతున్నారు. మా అమ్మాయి బి. ఏ. చదువుతోంది. అన్నగారింకా రాలేదని ఆగ్రహపడుతోంది. "ఎంత తను ఉద్యోగంలో చేరితేమాత్రం...నాన్నగారు కనిపెట్టుకుని ఉంటారు. పెందలాడే ఇంటికి చేరుకోవాలన్నది తెలియక్కర్లే" అని అంటున్నది.

"అమ్మాయీ ఉద్యోగం ఉద్యోగం అంటున్నావ్. వాడు ఉద్యోగంలో చేరి ఒక నెలేగా అయింది. ఇవ్వాళ జీతం అందుకున్నాడేమో, వస్తాడు మరి స్నేహితులతో ఎక్కడికన్నా వెళ్ళి ఉంటాడు" అని సమాధాన పరుస్తున్నది మా శ్రీమతి. మిగతా ముగ్గురు పిల్లలూ చిన్నవాళ్ళు. ఆ సమయంలో వాళ్ళకు ఆకలితప్ప మరోటి తెలియడంలేదు. గిలగిల్లాడుతున్నారు. శ్రీమతి భోజనాలకు అంతా సిద్ధంచేసింది.

నాకూ ఆకలి అవుతున్నది కాని ఆలోచిస్తున్నాను.

మొన్న మొన్న పెళ్ళి అయినట్లున్నది. పాతికేళ్ళయినా—పెళ్ళి హడావుడి, శోభనంనాటి రాత్రి, ఆ తర్వాత సంవత్సరంలోపల దీపావళి పండుగు, అత్తవారింటికి ప్రయాణం, పండగ భోజనం. పండగ సరదా. టపాకాయల వెలుగు, విష్ణుచక్రం, వెలుతురు సున్నాలు. ఆ సున్నాల్లో కిలకిలా నవ్వుతున్న లలిత. ఆ మరుసటి సంవత్సరం దీపావళికి...గోపి మరీ పసివాడు నెలన్నా నిండలేదు. లలిత బాలింత. అసలే పచ్చటి శరీరం. ఆరోజు మధ్యాహ్నం భోజనాలయినతరువాత, తమలపాకు చిలకలు నాకిచ్చి తను వేసుకున్నది. చెవుల్లో దూది, ఎర్రటి పెదిమలు. నుదుట పావలాఅంత కుంకుమ, రెపరెపలాడుతున్న కెంపురంగు క్రొత్తచీరె, లేత తమలపాకులా ఉంది లలిత.

ఇల్లంతా సందడిగాఉంది. ఇంట్లో అత్తగారూ బావ మరదులు మరదళ్ళు ఒకరకంగా కోలాహలంగానే ఉంది. లలితకు దగ్గరగా వెళ్ళ కూర్చుందామనిపించింది. పిలుపడలేదు దూరంగా కుర్చీలో కూర్చుని లలితను చూస్తున్నాను.

ఆనాటికి నెలన్నా నిండని గోపీ పెద్దవాడయ్యాడు! బీకామ్ ప్యాసయినాడు. ప్యాసయిన ఆర్నెల్లకు ఓ ఉద్యోగం దొరికింది. జీతం మూడువందలని మురిసిపోయింది లలిత. గోపీ తరువాత గౌరి, గౌరి తరువాత హరి, తరువాత రవి, ఉమ. ఈ అయిదుగురూ నాకూ లలితకూ పంచప్రాణాలు! కాలం కదంతొక్కినట్లేవుంది. కళ్ళు మూసి కళ్ళు తెరిచినట్టుగా ఉంది.

విష్ణుచక్రం వెలుతురు సున్నాలలోంచి ఇంకా బయట పడలేదు నేను.

"గోపీకి నూరేళ్ళు" అంటున్నది లలిత.

గోపి బాణంలా ఇంట్లోకి దూసుకు వచ్చేడు. వస్తూనే "సారీ...నాన్నగారూ! నా కోసం అంతా కనిపెట్టుకుని ఉన్నారు. కొంచెం ఆలస్యం అయిపోయింది. ఆఫీసులో స్నేహితులు కొంత మంది పార్టీ ఇవ్వాలని గోల చేసేరు" అన్నాడు.

అంటూనే గబగబా పెరట్లోకి వెళ్ళేడు కాళ్ళు కడుక్కుని రావడానికి.

లలితను పక్కకు పిల్చేను. మరీ దగ్గరగా వచ్చింది ఏదో రహస్యం చెప్తాననుకుని.

"గోపీని జీతం విషయం యేమీ అడగద్దు" అన్నాను.

"నేనంత తెలివితక్కువదాన్ననుకున్నారా" అన్నది లలిత తృప్తిగా నవ్వుతూ.

అందరం భోజనాలకు కూర్చున్నాం. మా అందరి భోజనాలు వడివడిగా సాగుతున్నాయి. గోపీమాత్రం నెమ్మదిగా కొంచెంకొంచెం తింటూ నెమరు వేస్తున్నాడు.

"అన్నాయ్‌కి ఇంటి భోజనం సహించ లేదు. పెద్దఉద్యోగస్తుడు కదూ.." అంటున్నది గౌరి.

గోపీ చిరాకుతో, "నే ఉద్యోగం చేస్తున్నానని అంత కుళ్ళుకోకు నీవు" అన్నాడు.

"మహా వెలగబెట్టావులే..." అన్నది గౌరి.

"మీ రిద్దరూ పెద్దవాళ్ళవుతున్నారు. ఇంకా చిన్న పిల్లల్లా కీచులాడుకుంటే ఎలా..." అని ఇద్దరికీ సమాధాన పర్చింది లలిత.

గోపీకి గౌరికి వయస్సులో తేడా రెండుసంవత్సరాలు. ఇద్దరూ చిన్నప్పటినుండీ కీచులాడుకోవడం పరిపాటి. గోపీకి గౌరి అంటే ప్రాణం...గౌరికి గోపీ అంటే ప్రాణం. ఇట్లే పోట్లాడుకుంటారు. ఇట్లే కలుస్తారు మళ్ళీ...ఒకసారి గౌరికి జ్వరం వచ్చినపుడు...అప్పుడు గౌరికి పదేళ్ళు. మూలుగుతూ పడుకున్నది. వళ్ళు సలసల కాగిపోతున్నది. గోపీ బిక్క మొగం వేసుకుని మాటిమాటికీ గౌరిని వచ్చి చూస్తూ, అమ్మా, ఇంకా గౌరికి జ్వరం తగ్గలేదమ్మా అని ఏడుస్తూ కూచున్నాడు. ఆ ఏడుపు బయటకు వినిపించడంలేదు. లోపల ఇముడ్చుకో లేక పోతున్నాడు.

నాకు వాణ్ణిచూస్తే జాలేసింది. పిల్లలకు జ్వరాలు వస్తుంటాయి, తగ్గుతుంటాయి...ఇవి అందరిళ్ళల్లోనూ సహజం. కాని గౌరికి జ్వరం వస్తే గోపి గిజగిజ తన్నుకున్నాడు. కాలు గాలిన పిల్లిలా అటూఇటూ తిరిగాడు—

ఆడుకుంటూ పోట్లాడుకుంటారు ... పోట్లాడుకుంటూ ఆడుకుంటారు...ఆడుకుంటూ పోట్లాడుకుంటూ మాట్లాడు కుంటారు.

నూనూగుమీసాలు, పిల్లిగడ్డం...

వాడు కాలేజీలో చేరినపుడు...

"వాడికో షెవింగ్‌సెట్ తెచ్చిపెడ్దురూ..." అని లలిత నాకు జ్ఞాపకంచేసిందాకా, వాడు పెద్దవాడవుతున్నాడని నేను గమనించలేదు.

ఎప్పుడు పెరిగేడో, ఎట్లా పెరిగేడో, అప్పుడే నా అంత అయినాడు-ఉద్యోగం చేస్తున్నాడు.

ఉంగరాలజుట్టూ, పసిడిశరీరం, బొద్దుగావున్న గోపీ, మొలకు నాళ్ళన్నున్న చెయించిన బంగారు మొలత్రాడు-మెళ్ళో వొంటిపేట పులిగోరునాను - వాడి బోసినవ్వులూ, ఉయ్యాలలో పడుకుని చేతులు అటూ యిటూ తిప్పుతూ వాడు చేస్తున్న భరతనాట్యం...ఇంకా నా కళ్ళల్లో మెదుల్తూనే వున్నాయి. భోజనాలయినాయి. అలవాటుచొప్పున వరండాలో సిగరెట్ కాలుస్తూ అటూయిటూ తిరుగుతున్నాను.

మరో యేడెనిమిదేళ్ళల్లో రిటైరవచ్చు. ఉద్యోగంలో చేరి చాకిరీ చెయ్యంగా, చెయ్యంగా మెదడంతా అరగిపోయి, చిన్న చిన్న ప్రమోషనులు, తర్వాత ఆఫీసరు ప్రమోషను... ఆఫీసరు హోదాకోసం తప్పనిసరిగా అప్పుచేసి కారుకొనడం... అందరూ నేను సుఖంగా ఉన్నాననుకోవడం, సంసారం బరువుగా లాక్కొస్తూనే వున్నాను నెమ్మదిగా. అయితే గమ్యం ఏమిటో తెలియడంలేదు. గానుగెద్దు జీవితంలా వుంది.

గౌరి మెరుగులోంది. పెళ్ళిచేయాలి. వరుణ్ని వెదకాలి. మామగార్నవుతాను. అల్లుడికి భయపడతాను. ఆ అల్లుడు గౌరిని సరిగా చూస్తాడో చూడడో!

చూసినా చూడకపోయినా పెళ్ళయిన తరువాత సంసారం నెట్టుకుపోతారు. పిల్లలు పుడతారు. నేను తాతనవుతాను. ఇంత త్వరగా తాతనవడం ఇష్టంలేదు.

నేనింకా అటూ యిటూ తిరుగుతున్నాను. గోపీ నా

దగ్గరకొచ్చి ఏదో మాట్లాడాలని ప్రయత్నంగా ఉన్నాడు. మాట్లాటడానికి సందేహిస్తున్నాడల్లే వుంది.

నాన్నగారూ! అన్నాడు నెమ్మదిగా.

"ఏమిటి విశేసం. ఉద్యోగం ఎలా వుంది" అన్నాను.

"బాగానే వుంది. కాని మా బాస్ పట్టి చాదస్తం మనిషి. చాలాసేపటివరకూ ఆఫీసులో కూర్చుంటాడు-బజార్లో ఓ కొట్లో టెర్లిన్ సూటింగు క్లాత్ చూసేను. చాలా బావుంది. లేటెస్టు డిసైన్‌ట" అని నీళ్ళు నములుతున్నాడు.

"వరలక్ష్మి శుక్రవారం వస్తోంది రెండు రోజుల్లో. ఆమె సంగతి చూడు" అన్నాను.

వాడు గ్రహించుకున్నట్టు లేదు. విడమరచి పెద్దగా చెప్తే లలిత వినేట్టుగా వుంది. దగ్గరకుపిలిచి చెవిలో ఊదాను.

* * *

శుక్రవారం వచ్చింది.

ఒక బంగారుకాసు. ఒక పట్టుచీరె తెచ్చి వాళ్ళమ్మ కిచ్చేడు గోపీ.

ఇవన్నీ ఎందుకురా అన్నది లలిత.

గోపీలో ఏ భావమూ లేదు. నామాట కాదన లేక తప్పని సరిగా కొన్నట్టుగా ఉన్నాడు.

లలిత తలకు స్నానంచేసి పట్టుచీరె కట్టుకుని మడిలో పూజ ప్రారంభిస్తోంది.

పచ్చటి శరీరం. పట్టుచీరె. నుదుటిమీద పావలా అంత జపాకుసుమంలా మెరుస్తున్న కుంకుమ. అయిదుగురు పిల్లల తల్లిలా కనిపించడంలేదు. నా కళ్ళకింకా పెళ్ళికూతురులాగే వుంది. ఆమెలోని ఆకర్షణకు తట్టుకోలేక పోతున్నాను. కాశ పోసి పట్టుచీర కట్టింది. ఆ చీరకట్టువిధానంలో పిక్కలు కనిపిస్తున్నాయి. చూడగానే పార్వతిదేవిలా కనిపించింది. ఆ దేవతకు దణ్ణం పెట్టాలనిపించింది.

నా మనసు మనస్కరించలేదు. అమాంతం దగ్గరకు తీసుకోవాలనిపించింది. ఆమె మడి. భక్తితో పూజచేస్తున్నది. ఇంట్లో పిల్లలు...సందడి...నా కోర్కెను చంపుకున్నాను.

"ఒరే గోపీ అమ్మకు దణ్ణంపెట్రా" అన్నాను.

లలిత గోపీని దీవించింది.

ఆరోజు మధ్యాహ్నం ఆఫీసుకు భోజనం క్యారియరులో పంపించింది లలిత. వడలు, పులిహోర, పాయసం వీటన్నిటితో తృప్తిగా భోజనం చేశాను.

సాయంత్రం కొంచెం ఆలస్యం అయింది యింటికి వెళ్ళేటప్పటికి.

యింట్లో యేదో పెద్దగా మాట్లాడుతున్నాడు గోపీ.

"అంత ఖరీదుపెట్టి పట్టుచీరె తెస్తే పూజ పూజ అని దాన్ని నానారకాలుగా నలిపేసి అప్పుడే మాసిపోయేట్లు చేశారు. దాన్నిండా కుంకుమ-గంధం మరకలూ, పాతగుడ్డలా దాన్ని ఓ మూల స్టాండ్ మీద పడేశారు.

ఆ చీరె సినిమాకో, ఏదన్నా ఫంక్షన్‌కో నాజూకుగా

కట్టుకుని వాడుకుంటే బాగుంటుంది. ఎంతవయసు వస్తే యేం బొత్తిగా డబ్బువిలువ తెలియదు. కల్చర్ అంటూ అసలే లేదు' అంటున్నాడు గోపీ.

నేను రావడం గమనించి లలిత నావేపు అలాదోచూస్తున్నది. ఆ చూపులోని భావం నే గ్రహించాను.

గౌరి గోపీవేపు కోపంగా చూస్తున్నది.

"కల్చర్ ..కల్చర్ అంటున్నావ్. నీ కున్నదిలే బోడి కల్చర్. అమ్మను అవటానికి నీకు నోరు ఎలా వచ్చిందిరా" అంటున్నది గౌరి. గోపీ రెచ్చిపోయాడు.

"ఈ ఆడవాళ్ళు ఎప్పుడూ ఇంతే! వినరు ఒకరు చెప్తే. తమకు తోచదు. అసలు బుర్ర ఉంటేగా."

"ఒరేయ్ గోపీ! మాటలు తిన్నగారానీ. హద్దులు మీరుతున్నావ్" గౌరి కళ్ళు ఎర్రజేసింది. గోపీ యింకా కారాలు, మిరియాలు నూరుతున్నాడు. మాటా మాటా పెరిగింది చేతుల్దాకా వచ్చేట్టుగా వుంది.

లలిత నా వేపు చూస్తూనే వుంది.

రవి, హరి అకకపక్షం అన్నట్టుగా గౌరి వెనకాలే నిల్చుని గోపిని ఉమి ఉమి చూస్తున్నారు. ఆ సమయంలో యేం మాట్లాడాలో తోచడంలేదు. తెలియడంలేదు.

"నీకు బుద్ధి లేదురా గోపీ" అంటున్నది గౌరి. అవును అవును అంటున్నారు రవి, హరి బుద్ధి ఉండడం, బుద్ధి లేకపోవడం అంటే ఏమిటో తెలిసినట్టుగా.

గోపీకి రోషం, క్రోధం ఎక్కువైంది.

“పోండర్రా మీతో నాకేమిటి...మీరంతా ఇడియట్స్” అన్నాడు.

“మేం ఇడియట్స్ అయితే నీవో గొప్ప ఫూల్‌వి” అన్నది గౌరి. రవి హరి చప్పట్లు కొట్టారు.

గోపీ గౌరిమీదకు ఉరుకుదామా అన్నట్లుగా ఉన్నాడు. మీ వీపులు కాచుకోండి అని చెయ్యి ఎత్తేడు.

ఒరేయ్ గోపీ అని గదమాయించాను. లలిత అక్కడ నిల్చున్న దన్న మాటేగాని ఎక్కడో చూస్తున్నది.

ఆమెకు డొక్కాలో మోకాళ్ళతో పొడిచినట్లయింది.

పురిటిమంచం. గోపీ పుట్టినపుడు తను బాగా నీరసించి పోయింది మూలుగు.

పుట్టూనే బొద్దుగావున్న గోపీ మామూలు పిల్లలకంటే తూకం ఎక్కువే. చాలా ఆరోగ్యంగా ఉన్నాడన్నాడు డాక్టరు. చారడేసికళ్ళు, ఆకలయితే ఇల్లంతా దద్దరిల్లిపోయేట్లు ఏడ్చేవాడు. పచ్చడి మెతుకులూ పప్పూకూరా తింటున్నా లలితది సహజంగా ఆరోగ్యకరమైన శరీరం. గోపీ పుట్టిన తరువాత ఆమెకు అందం, ఆరోగ్యం మరీ ఎక్కువైనట్లుగా ఉండేది గోపీని దగ్గరకు తీసుకుని గుండెలకు హత్తుకుని వాడి మీద చీరెకొంగు కప్పి వాడిమీద చేయివేసి వాడి కళ్ళల్లోకి చూస్తూ పాలిస్తుంటే, ఆపురావురుమని చుబుక్ చుబుక్ అని

చప్పుడు చేస్తూ చేతుల్తో ఆడుకుంటూ లలితకి చక్కిలిగింతలు పెడ్తూ పాలు తాగేవాడు గోపి. పాలు తాగుతుంటే నరాలన్నీ తోడేసినట్టుగా ఉండేది. ఆ చిన్నచిన్న కాళ్ళతో కుమ్మేవాడు. డొక్కలో కాళ్ళతో తన్నేవాడు. తీయగా హాయిగా ఉండేదా బాధ. నా తండ్రే నా బంగరుపంటే అని మరీ దగ్గరగా తీసుకుని ఆబాధలో వాడి బుగ్గల మీద ముద్దులవర్షం కురిపించేది. లలిత గోపీ పాలు తాగుతున్నపుడు ఎప్పుడన్నా హఠాత్తుగా నేను చూసినప్పుడు లలిత సిగ్గుతో కుంచించుకు పోయేది. పమిట బుజానికంతకూ కప్పుకుని నా వైపుచూసి ఆ తన్మయత్వంతో నిండుగా నవ్వేది. ఆ నవ్వులో ముత్యాలవర్షం. ఆ కళ్ళల్లో అంతులేని ఆప్యాయత, నా కెందుకో ఆకూ అలమూ గడ్డీ తిని కమ్మని పాలిచ్చే ఆవు. ఆ ఆవుపాలు తాగి కోరల్లో విషం పెంచుకున్న పాము కళ్ళల్లో మెదిలినై.

"ఛ, ఇదేం పోలిక. ఇలాంటి ఆలోచన్లు నాకు రాకూడదు. మా గోపీ బంగారుతండ్రి, చిన్నతనం... తెలియక ఏదో అంటున్నాడు అని సమాధాన పరచుకున్నాను.

లలిత కళ్ళెందుకో చెమర్చటం చూశాను. ఒరేయ్ గోపీ, గౌరీ, హరీ...భోజనాలకు వేళవుతున్నది. రెడీ అవ్వండి అంటున్నది లలిత.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది.

* * *

ఆరోజు రాత్రి లలిత నా చెంతన చేరినపుడు హాయిగా దగ్గరకు తీసుకున్నాను..."ఏమండోయ్ చూశారా, వీడికి అప్పుడే నా డబ్బు, నా వస్తువు అనేభావం వచ్చేసింది" అన్నది నవ్వుతూ.

"ఉద్యోగం వెలగబెడ్తున్నాడుగా, అయినా వాడి డబ్బు మనకెందుకే, వాణ్ణి పెంచి పెద్దవాణ్ణి చేశాం. ఇప్పుడు రెక్కలు వచ్చినయి. రేపోమాపో ఆ కోడలు పిల్ల వస్తే... ఎగిరి పోనే పోతాడు" అన్నాను.

"బాగా చెప్పారు" అంటూ ఇంకా దగ్గరగా వచ్చింది. గువ్వలా నాలో ఒదిగిపోయింది.

"ఆ పట్టుచీరె బిల్లు...డ్రాయర్లో ఉందా?" అన్నాను.

* * *

ఆ నెలాఖరున జీతం రాగానే ఆ చీరె ఖరీదుకు ఓ మంచి టెర్లిన్ సూట్ గుడ్డ బజార్లో కొని ఇంటికి తెచ్చాను.

గౌరి చూసింది దాన్ని.

"ఈ సూటు గుడ్డ చాలా బావుంది. మీరు పట్టించుకోండి నాన్నగారూ" అన్నది గౌరి.

"నా కెందుకమ్మా ఇంకా సూట్లు, ఉన్నవి చాల్లే" అన్నాను.

ఎక్కడ ఆడుకుంటున్నారో రవి, హరి పరుగెత్తుకుంటూ లోపలకు వచ్చేరు. వాళ్ళదృష్టి అంతా దానిమీదే

ఉంది. ఆదుర్దాగా ఆ సూటుగుడ్డవైపు చూస్తున్నారు. "పండగలొస్తున్నాయి. తమకోసమేనేమో అది తెచ్చింది చక్కగా నిక్కర్లు కుట్టించుకోవచ్చు" అనుకుంటున్నారు. హరి రవి చెవిలో ఏదో చెప్తున్నాడు. గుసగుసలు...మనకే లేరా అంటున్నాడు రవి వినపడీ వినపడనట్లు. వాళ్ళిద్దరి ముఖాలు విప్పారినయి వాళ్ళ కళ్ళల్లో బోలెడంత సంతోషం తొంగిచూస్తున్నది.

ఇంతలో గోపీ ఎక్కడనుండో అమాంతం వచ్చేడు.

"ఒరేయ్ గోపీ ఇలారా" అన్నాను. వాడు నెమ్మదిగా వచ్చేడు దగ్గరగా.

"గోపీ! నీకో ప్రజంటు తెచ్చానురా...చూడు"... అని ఆ సూటు గుడ్డను వాడి చేతిలో ఉంచుతూ..."నీకు ఉద్యోగం వచ్చిన శుభ సమయాన...నీకీ ప్రజంట్...బెస్ట్ ఆఫ్ లక్..." అంటూ వాడి చేతిని నా చేతిలోకి తీసుకున్నాను.

అది చూసుకుంటూ ... వాడు... వండర్ ఫుల్ ... చాలా బాగుంది ఇది. థ్యాంక్యూ... నాన్నగారూ... అన్నాడు.

ఆనందబాష్పాలో...మరేవిటో...అవి...లలిత కళ్ళు వత్తుకుంటూ...

"గోపీ ... నాన్నగారికి నమస్కారం చెయ్యి..." అన్నది.

వాడు వంగి నా కాళ్ళను తాకేడు.

"ఆల్ ది బెస్ట్" అని దీవించాను.

గౌరి నా వైపు చూస్తున్నది...

రవి, హరి, ఉమ... బిక్క మొహాల్తో చప్పట్లు కొట్టేరు!!...

యువ

... * * * ...